## ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

# అందించడమే ప్రభుత్వలక్ష్యం

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి






జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, జూలై 16, 2026 పేజీలు : 7







# 2047నాటికి తెలంగాణాను 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజా జ్యోతి బ్యూరో): పారిశ్రామిక, సాగునీటి, వ్యవసాయ రంగాల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించి, స్పష్టమైన విధానాలతో 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దాదాపు నాలుగు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణం అనంతరం అమరరాజా తన తొలి భారీ పెట్టుబడిని తెలంగాణలో పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విధానంపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా

# వదిలేయడం కాదు.. 'ఊయల'లో ఉంచి ప్రాణాలు కాపాడండి

-పసిబిడ్డల భవిష్యత్తుకు భరోసా.. జిల్లా ఆసుపత్రిలో 'ఊయల' -కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



నారాయణపేట, జులై 15: అనివార్య పరిస్థితుల్లో నవజాత శిశువులను రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, చెత్తకుప్పలు వంటి ప్రాంతాల్లో వదిలివేయకుండా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 'ఊయల' లో సురక్షితంగా ఉంచాలని

# సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి

### అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



# 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణకు అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీ కీలకమని, తెలంగాణ ఈ రంగంలో దేశానికి కేంద్రబిందువుగా అవతరిస్తోందన్నారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న 32 గిగావాట్ సామర్థ్యం గల ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా ఇప్పటికే 700 మందికి ఉపాధి లభించగా, వారిలో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. అమరరాజా రాకతో పాలమూరు రూపురేఖలు మారనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణంతో పరిశ్రమలను మరింత ప్రోత్సహిస్తోందని తెలిపారు. పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాలకు ప్రత్యేక విధానాలు అమలు చేస్తూ 2047 నాటికి తెలంగాణను దేశ అభివృద్ధికి కీలక శక్తిగా నిలబెట్టే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలను ప్రపంచస్థాయి పారిశ్రామిక, సేవారంగ, వ్యవసాయ ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు దత్తత తీసుకోవాల్సిన జిల్లాగా ఉన్న మహబూబ్‌నగర్, ఇప్పుడు ఇతర జిల్లాలను దత్తత తీసుకునే స్థాయికి ఎదిగిందని వ్యాఖ్యానించారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పాలమూరు --రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటి కేటాయింపు కోసం కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే పాలమూరు రైతులకు శుభవార్త అందిస్తామని సీఎం వెల్లడించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు -- రంగారెడ్డి, రాజోలిబండ (ఆర్‌డీఎస్) వంటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "తెలంగాణ రైజింగ్--2047" లక్ష్యాల్లో భాగంగానే అమరరాజా 32 గిగావాట్ల ప్లాంట్ ప్రారంభమైందన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధన కోసం క్లీన్, గ్రీన్ ఎనర్జీ విధానాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. 2031 నాటికి ఈవీ బ్యాటరీల వినియోగం నాలుగు రెట్లు పెరిగే అవకాశముందని, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధి 2023లో 6.8 శాతం నుంచి 2026 నాటికి 8.1 శాతానికి చేరిందని, 2034 నాటికి 13 శాతానికి పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అమరరాజా వంటి ప్రపంచస్థాయి పరిశ్రమ జిల్లాకు రావడం అదృష్టమని అన్నారు. విదేశాలపై ఇంధన ఆధారాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచే దిశగా ఇది కీలక అడుగని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దివిటిపల్లి గిగా మ్యానుఫ్యాక్చరింగ్ కారిడార్‌గా రూపుదిద్దుకుంటోందని, భవిష్యత్తులో 30 వేల ఎకరాల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పడే అవకాశముందని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎస్పీ జానకితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వదిలేయడం కాదు.. 'ఊయల'లో ఉంచి ప్రాణాలు కాపాడండి

జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయల కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వదిలివేయబడిన నవజాత శిశువుల ప్రాణాలను కాపాడి, వారికి సురక్షితమైన సంరక్షణతో పాటు మంచి భవిష్యత్తును కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం కొంతమంది నవజాత శిశువులను అనాథలుగా వదిలివేస్తుండగా, మరోవైపు సంతానం లేని అనేక మంది దంపతులు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల ప్రకారం చట్టబద్ధ దత్తత కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని, ఏ కారణం చేతనైనా శిశువును పెంచుకోలేని తల్లిదండ్రులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా శిశువును ఊయల కేంద్రంలో ఉంచి వెళ్లవచ్చని సూచించారు. ఊయలలో ఉంచిన శిశువుల పూర్తి బాధ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ తీసుకుని, వారికి అవసరమైన వైద్య సంరక్షణ, రక్షణ కల్పిస్తుందని తెలిపారు. అనంతరం అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన దంపతులకు చట్టబద్ధంగా దత్తత ఇచ్చే చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నవజాత శిశువుల ప్రాణాలను రక్షించడంతో పాటు, వారికి ప్రేమతో కూడిన కుటుంబం, ఉజ్వల భవిష్యత్తు అందించే అవకాశం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జయచంద్ర మోహన్, జిల్లా శిశు సంరక్షణ అధికారి (డీసీపీఓ) కరిష్మా, మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి

లింగాల జులై 15

ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా( ఎస్ ఐ ఆర్) ఓటర్ల జాబితాను సకాలంలో తప్పులు లేకుండా పూర్తి చేయాలని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన సర్ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ గురించి అధికారులకు పలు సూచనలు చేశారు . ఓటరు జాబితాలో పేరు కోల్పోతే తిరిగి నమోదు చేయడం కష్టమవుతుందని అందువలన ఎస్ఐఆర్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఏ ఒక్కరూ కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈనెల 24 వరకు ఎన్నికల సంఘం గడువు ఇవ్వడం జరిగిందని ఆలోగా దరఖాస్తులను పూర్తి చేసి సంబంధిత బి ఎల్ వో లకు అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. అనంతరం మండల కేంద్రమైన లింగాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మందుల దుకాణం (మెడ్ ప్లస్) ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేష్, సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య , నాయకులు నారాయణ గౌడ్, నాగేశ్వరరావు, శంకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వలక్ష్యం




**కల్వకుర్తి,జులై 15 (ప్రజా జ్యోతి):**
ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు గాను నూతనంగా ఏర్పాటు చేసిన రెండు డయాలసిస్ యూనిట్లను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ రెండు యూనిట్ల ప్రారంభంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ల సంఖ్య 5 నుండి 7కి పెరిగింది. దీంతో నియోజకవర్గంలోని కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులకు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు హైదరాబాద్ మహబూబ్‌నగర్ వెళ్లకుండానే మెరుగైన డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా పరామర్శించిన ఎమ్మెల్యే, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, భోజన సౌకర్యాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. కల్వకుర్తి ఆసుపత్రిని అన్ని రకాల సౌకర్యాలతో కూడిన ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలి" అని సూచించారు.కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం కోసం మరిన్ని ఆధునిక పరికరాలు, సిబ్బంది నియామకానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమాకాంత్ రెడ్డి, కొండల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జిగా గవినోళ్ల శ్రీనివాస్ నియామకం

నారాయణపేట ప్రతినిధి జూలై 15 (ప్రజా జ్యోతి)



అధినేత్రి కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలు తెలిపిన నూతన ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంచార్జిల నియామకాలను చేపట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత రాష్ట్రంలోని 23 మంది నియోజకవర్గ ఇంచార్జిలను నియమించారు.ఈ నియామకాలలో భాగంగా నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జిగా గవినోళ్ల శ్రీనివాస్‌ను నియమించారు.ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ ఆత్మగౌరవం మరియు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నారాయణపేట నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.

# అపరిశుభ్రతపై కార్పొరేషన్ ఉక్కుపాదం

## - కుళ్లిన పండ్ల స్వాధీనం.. ఫేమస్ జ్యూస్ పాయింట్‌కు రూ.5 వేల జరిమానా

మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అపరిశుభ్ర ఆహార విక్రయాలపై మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కొరడా ఝుళిపించింది. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న ఫేమస్ జ్యూస్ పాయింట్పై బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది, జవాన్లు దుకాణాన్ని తనిఖీ చేయగా, అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచిన పండ్లు, పురుగులు పట్టిన, కుళ్లిన పండ్లు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని మున్సిపల్ ఆటోలో తరలించి నిర్వీర్యం చేశారు.

ఆహార పదార్థాలను పరిశుభ్రంగా నిల్వ చేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత దుకాణ యజమానికి రూ.5,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహార పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని



హెచ్చరించారు. పట్టణంలోని హోటల్ నిర్వాహకులు, జ్యూస్ సెంటర్లు, పండ్ల దుకాణాల యజమానులు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రజారోగ్యానికి భంగం కలిగించే వారిపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు.

# టీజీఓ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలు యాదవ్

**- నూతన బాధ్యతల స్వీకరణపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రతినిధులు..**
**- టీజీఓ భవనానికి స్థలం కేటాయింపునకు హామీ**

మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజా జ్యోతి బ్యూరో): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా బాలు యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా టీజీఓ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాలు యాదవ్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, టీజీఓ జిల్లా శాఖకు శాశ్వత భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. టీజీఓ జిల్లా శాఖ



మరింత బలోపేతమై ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఎంపీడీఓ కరుణ శ్రీ, టీజీఓ ఉపాధ్యక్షులు తానాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధర్, రమేష్, నర్సింహారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు హరినాథ్‌తో పాటు పలువురు గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

# సహన్యాయవాదిపై దాడిపై సస్పెండునకు డిమాండ్

## - న్యాయవాదులు పాదయాత్ర, ఎస్పీ హామీ

**నారాయణపేట ప్రతినిధి జులై, 15 (ప్రజా జ్యోతి)**

నారాయణపేటలో స్థానిక న్యాయవాద సంఘం నేతృత్వంలో శుక్రవారం పట్టా భూమి పై సాగు చేస్తున్న న్యాయవాది నీరజ్‌పై పక్క రైతులు లాఠీలు, కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఘర్షణ జరిగింది. బాధితుడిపై పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేస్తూ పోలీస్ అధికారులు పనిచేయకపోవడంతో (సంబంధిత ఎస్సైలు, సీఐలు) సస్పెండ్ చేయాలని నారాయణపేట న్యాయవాదులు డిమాండ్ చేశారు.

దామోదర్ గౌడ్ అధ్యక్షతన నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు నుండి ఎస్పీ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహిస్తూ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ను కలిశారు. న్యాయవాదుల పోరాటం ఉద్దేశ్యం బాధిత న్యాయవాదికి పూర్తి న్యాయం జరగడం, పోలీసుల తిట్టింపులకు గురికాకుండా తీర్పులు నిష్పక్షపాతంగా రావాలని వారు తెలిపారు.

ఈ పరిణామంలో ఎస్పీ డా. జి. వినీత్ హామీ ఇచ్చారు. పూర్తి స్థాయిలో విచారించి బాధితుడికి న్యాయం కల్పిస్తామని, అవసరమైతే సంబంధిత పోలీసులు పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. న్యాయవాద సంఘాలు ఈ హామీ మేరకు విధానాలు పరిశీలించి తదుపరి చర్యలపై ఆలోచిస్తాయని ప్రకటించాయి. కార్యక్రమంలో కేంద్ర స్థాయికి చెందిన న్యాయవాద సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం. చెన్నారెడ్డి, వ్యవహారాల కార్యదర్శి అమీరుద్దీన్, బాధిత న్యాయవాది నీరస్, న్యాయవాదుల కురుమన్న గౌడ్, నరసింహులు యాదవ్, టి. రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్ నామాజీ, వినోద్ ఆడెం, శ్రీనివాస్, దత్తాత్రేయ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ కోరినట్లు, న్యాయవాదులకు సంబంధించిన ఏదైనా పక్షపాత విచారణలుంటే వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఉమ్మడి పాలమూరు జిల్లా న్యాయవాద సంఘాలు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నాయి.



# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజా జ్యోతి బ్యూరో):**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్--2027 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీసీ స్టడీ సర్కిల్, మహబూబ్‌నగర్ ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. పి. విశ్వా నందన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు ఈ కోచింగ్ అందించనుండగా, అందులో 100 మంది ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడతారు. మిగిలిన 50 మంది యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రత్యేక స్క్రీనింగ్ లేకుండా అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టైపెండ్ (హాజరు నిబంధనలకు లోబడి), ఒకసారి రూ.5,000 పుస్తక నిధి, గ్రంథాలయ సౌకర్యం, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణతో పాటు స్టాటిక్ మరియు కరెంట్ అఫైర్స్ అంశాలపై సమగ్ర మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, భారతీయ పౌరులై ఉండాలని, రాష్ట్రంలో ఇంటర్ వరకు చదివి ఉండాలని, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలకు రూ.2.00 లక్షలుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు జూలై 17 నుంచి ఆగస్టు 7, 2026 వరకు స్వీకరించబడతాయి. ఆగస్టు 13న హాల్ టికెట్లు, ఆగస్టు 16న స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి ధ్రువపత్రాల పరిశీలన, ఆగస్టు 24న కోచింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి. అభ్యర్థులు ఞఞఞ.స్త్రఎఎర్బుఎఎఱతీఎశ్రీవ.ఎస్త్రస్త్ర.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం, గవర్నమెంట్ బీసీ కళాశాల ప్రాంగణం, పిల్లలమర్రి రోడ్, మహబూబ్‌నగర్‌ను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# పెద్దవార్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా పి. నర్సింహా రావుకు హర్షధ్వానాల మధ్య అభినందనలు



**గండీడ్, జూలై 15 (ప్రజాజ్యోతి):**

ఉమ్మడి గండీడ్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) నూతన పాలకవర్గంలో పెద్దవార్యాల్ గ్రామానికి చెందిన పి. నర్సింహా రావు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహా రావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి, రైతులకు సకాలంలో రుణాల మంజూరు, వ్యవసాయానికి అవసరమైన సేవలను అందించడం, సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రైతు బంధువులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సహకార సంఘం ద్వారా లభించే సేవలు ప్రతి అర్హ రైతుకు చేరేలా పనిచేస్తానని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామ అభివృద్ధిలో సహకార సంఘం కీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు నర్సింహా రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సేవా దృక్పథంతో రైతులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు సత్వరమే పరిహారం అందించాలి

### భూనిర్వాసితుల ధర్నా
### భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు
### జి వెంకట్రామిరెడ్డి డిమాండ్



**నారాయణపేట ప్రతినిధి జూలై 15 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు సత్వరమే పరిహారం అందివ్వాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షులు జి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు .బుధవారం రోజు ఆ సంఘం ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ప్రభుత్వం భూ సేకరణ ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నప్పటికిని చాలామంది రైతులకు పరిహారం అందివ్వలేదని, ఊట్కూర్ , పేరపల్ల రిజర్వాయర్ లలో భూములు కోల్పుతున్న రైతులకు నేటికీ ఒక పైసా అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయి ఎత్తిపోతల పథకానికి తమ భూములనందిస్తున్న రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరించే తీరు ఇదేనా అని మండిపడ్డారు .భూ నిర్వాసితుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్ గోపాల్ రెడ్డి ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఉద్మల్ గిద్ద గోపాల్ మాట్లాడారు .పొలాల్లో ఉన్న బోరు బావులు, పైప్ లైన్లు, చెట్లు తదితర వాటికి పరిహారం అందివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన భూనిర్వాసితులు మరో ప్రాంతంలో భూములు కొనేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ నుంచి అందే పరిహారం ఆలస్యం కావడం వలన భూ నిర్వాసితులు నష్టపోతున్నారని.భూముల ధరలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకున్న భూమి కంటే అదనంగా కాంట్రాక్టర్లు రైతుల భూములను ఆక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టరేట్ వెళ్లి వినతిపత్రం అందజేసారు ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం నేతలు కేశవ్ నర్సప్ప, కృష్ణయ్య, మహేష్ గౌడ్లు నిర్వాసితులు పాల్గొన్నారు

## సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేలా పాలకవర్గం కృషి చేయాలి

### ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి



**గండీడ్, జూలై 15 (ప్రజాజ్యోతి):**
ఉమ్మడి గండీడ్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కమతం విష్ణువర్ధన్ రెడ్డితో పాటు డైరెక్టర్లను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు అండగా నిలిచే ముఖ్యమైన వ్యవస్థలని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం అంకితభావంతో, పారదర్శకంగా పనిచేస్తూ రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సేవలు, ఎరువులు, విత్తనాలు తదితర సౌకర్యాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గండీడ్ సహకార సంఘాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు ఆర్థికంగా తోడ్పడే విధంగా సహకార సంఘాల ద్వారా రుణాల మంజూరు, వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం గండీడ్ మండల కేంద్రంలో మహబూబ్‌నగర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎండీఏ) నిధులతో ఏర్పాటు చేసిన ఆధునిక ఐమాక్స్ ఎల్ఈడీ వీధి దీపాలను ఎమ్మెల్యే డా. రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ లైట్ల ఏర్పాటు ద్వారా మండల కేంద్రంలో రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కలుగుతుందని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో గండీడ్, మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత లక్ష్మారెడ్డి, కే.ఎం. నారాయణ, పీసీసీ కార్యవర్గ సభ్యులు, సొసైటీ డైరెక్టర్ నరసింహారావు, గండీడ్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు భగవంతు రెడ్డి, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన జీఎంఆర్ అభిమాని ఆలేటి శేఖర్

### ఎండలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ



**అడ్డాకుల, జూలై 15 (ప్రజా జ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కొత్తకోటలో పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీవ్ర ఎండను సైతం లెక్క చేయకుండా ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి మానవతా దృక్పథంతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అభిమాని ఆలేటి శేఖర్ వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.అడ్డాకుల మండల పరిధిలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని పోలీసులు అభినందించారు.ఈ సందర్భంగా ఆలేటి శేఖర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే జీఎంఆర్ స్ఫూర్తితో ప్రజాసేవనే తన ధ్యేయంగా ఎంచుకున్నానని అన్నారు. ప్రజల భద్రత కోసం ఎండలోనూ అలుపెరగకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఇది చిన్న కానుక మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు, ప్రజాసేవలో ఉన్న సిబ్బందికి అండగా ఉంటుందని, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వంలో దేవరకద్ర నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు

## రోడ్డు పైనే ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం ప్రారంభం

గండీడ్, జూలై 15: గండీడ్ మండల కేంద్రంలోని వెన్నచేడ్ గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో స్వయంసేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ, దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం వంటి విలువలను ప్రతి స్వయంసేవకుడు ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం స్వయంసేవకులు గురుపూజ నిర్వహించి, భారత్ మాతాకి జై నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు. స్థానిక స్వయంసేవకులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష కరపత్రం ఆవిష్కరణ

### – విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు చక్కని వేదిక:
### జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

**మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజా జ్యోతి బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష కరపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి విజ్ఞాన్ మంథన్ దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద ఆన్‌లైన్ సైన్స్ పరీక్ష అని తెలిపారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (11వ తరగతి) వరకు చదువుతున్న విద్యార్థులు వివి ఎం అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని పరీక్షలో పాల్గొనవచ్చని చెప్పారు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు భాస్కర స్కాలర్‌షిప్, సృజన్ ఇంటర్న్‌షిప్, నగదు బహుమతులతో పాటు ప్రముఖ శాస్త్ర పరిశోధన సంస్థలు, సైన్స్ ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పిస్తారని తెలిపారు. భారతీయ శాస్త్రవేత్తలు, సమకాలీన శాస్త్ర సాంకేతిక అంశాలపై ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నిక్షిప్తమైన శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధనా సామర్థ్యాలను వెలికితీసి మరింత మెరుగుపరచడంలో ఈ పరీక్ష కీలక పాత్ర పోషిస్తుందని విజయకుమారి అన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు (89190 96703), జిల్లా సైన్స్ అధికారి షంషీర్ (91777 90051)లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షంషీర్, కలాం ల్యాబ్ వ్యవస్థాపకులు శ్రీధర్, కలాం ల్యాబ్ అధ్యక్షుడు జనార్దన్, నర్సప్ప, కరుణాకర్, ఆంజనేయులు, అనురాధ, రవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

